యాదగిరిగుట్ట కొండపైకి ఆటోలను అనుమతిస్తూ జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

గుట్టలోనే మెడికల్ కళాశాల

- జూలై వరకు వంద ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యంతో ఏర్పాటు
- ప్రభుత్వ విప్ అయిలయ్య
- యాదగిరిగుట్ట కొండపైకి ఆటోల ప్రారంభం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 11 : గత ప్రభుత్వం ఎక్కడ వైద్య కళాశాలను మంజూరు చేసిందో.. అదే స్థలంలో కొనసాగిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మల్లాపురమో, సైదాపురం గ్రామమో సరైన స్థలాన్ని ఎంపిక చేసి వైద్య కళాశాలను నిర్మిస్తామని చెప్పారు. యాదగిరిగుట్ట దేవస్థాన వైకుంఠ ద్వారం వద్ద కొండపైకి ఆటోలను అనుమతినిస్తూ ఆదివారం జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాల ఏర్పాటుకు కావాల్సిన స్థల సేకరణ చేయాలని కలెక్టర్, సబ్ కలెక్టర్లకు ఆదేశాలిచ్చామన్నారు. ఉస్మానియా ప్రొఫెసర్ మల్లికార్జున్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించినట్లు తెలిపారు. ఇప్పటికే 20 మంది స్టాఫ్ నర్సులను నియమించామని, జూలైలో ఎంసెట్‌లో ఎంపికైన 50 నుంచి 100 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు ఇక్కడే 20వేల ఎస్ఎఫ్‌టీ స్థలంలో హాస్టల్ వసతితో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. వైద్య కళాశాల ఎక్కడ కట్టాలో ప్రతిపక్ష పార్టీలు సూచనలు చేస్తే స్వాగతిస్తామన్నారు. వైద్య కళాశాల ఏర్పాటుపై ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ హన్మంతు కే.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆలయ ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, డీఈఓ భాస్కర్‌శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, ఎంపీపీ చీర శ్రీశైలం, సీఐ రమేశ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ధ్యానర్షి మెగా మురళికి ధ్యానయోగి అవార్డు ప్రదానం చేస్తున్న శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మెగా మురళికి ధ్యాన యోగి అవార్డు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ధ్యానర్షి మెగా మురళికి ధ్యానయోగి అవార్డును అందించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతులమీదుగా ఆదివారం ప్రదానం చేశారు. తారా ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ కీర్తి పురస్కారాల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తులకు ఈ అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగా ధ్యానమే జీవన గమనానికి మూలమని ప్రతి ఒక్కరూ ధ్యానమార్గంలో పయనించాలని చేస్తున్న కృషికి చిహ్నంగా ధ్యాన్యర్షి మెగా మురళికి ధ్యానయోగి అవార్డు ప్రదానం చేశారు. తనకు ఇంతటి అవకాశం కల్పించిన తారా ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులకు అవార్డు గ్రహీత మురళి కృతజ్ఞతలు తెలియజేశారు.

భువనగిరి గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న గురుకులాల డిప్యూటీ సెక్రటరీ వెంకటలక్ష్మి

సజావుగా గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్ష

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 11 : సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి భువనగిరి జిల్లాలో ఆదివారం నిర్వహించిన పరీక్ష సజావుగా జరిగినట్లు గురుకులాల రీజినల్ కో ఆర్డినేటరు శ్రీరాం శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో 7 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరిగింది. భువనగిరిలో 360 మందికి 341 మంది హాజరు కాగా, 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రాజాపేటలో 336 మందికి 311 మంది, అడ్డగూడూరులో 360కి 333, ఆలేరులో 312కు 287 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. చౌటుప్పల్‌లో 360 మందికి 327, వలిగొండలో 362కు 337, వలిగొండలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో 240 మందికి 230 మంది విద్యార్థులు హాజరయ్యారు.

జిల్లాలో మొత్తంగా 2,330 మంది విద్యార్థులకు 2,166 మంది పరీక్ష రాశారు. 164 మంది గైర్హాజరయ్యారు. 92.96 శాతం హాజరు నమోదైనట్లు చెప్పారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో పరీక్ష సరళిని గురుకులాల డిప్యూటీ సెక్రటరీ వెంటకలక్ష్మి, స్థానిక డిప్యూటీ తాసీల్దార్ మంజులా రెడ్డి పరిశీలించారు.

క్రికెట్ లీగ్‌ను ప్రారంభించిన ఎస్ఐ రమేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పింగళ్‌రెడ్డి

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి పింగళ్‌రెడ్డి

బీబీనగర్, ఫిబ్రవరి 11 : చదువుతోపాటు క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి పింగళ్‌రెడ్డి అన్నారు. మండలంలోని జైనపల్లి గ్రామంలో ప్రతియేటా నిర్వహించే క్రికెట్ లీగ్‌ను ఎస్ఐ రమేశ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం క్రికెట్ లీగ్‌లో పాల్గొన్న యువకులకు పింగల్ అన్న సేవాదళ్ ఆధ్వర్యంలో జెర్సీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న క్రీడలతో యువతలో క్రీడాస్ఫూర్తిని నింపడంతోపాటు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయన్నారు. జీవితంలో గెలుపోటములను సమానంగా స్వీకరించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ మొరిగాడి బాలమల్లేశ్, నాయకులు రమేశ్, మహేశ్, రఘునందన్ గౌడ్, మోయిన్, నరేందర్, నరసింహారెడ్డి, బాలపోషయ్య, అమరేందర్, చంద్రమౌళి, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, బాస్కర్, మధు, రాజు, శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

'చలో నల్లగొండ'కు చకచకా ఏర్పాట్లు

రేపే బీఆర్ఎస్ బహిరంగ సభ

సన్నాహక సమావేశాలతో పార్టీ శ్రేణులు సన్నద్ధం

సమాయత్తమవుతున్న కృష్ణా పరీవాహక ప్రాంత జనం

నల్లగొండలో బీఆర్ఎస్ సభ ఏర్పాట్లు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి11(నమస్తే తెలంగాణ) : కృష్ణానదీ ప్రాజెక్టుల పట్ల కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం ధోరణిపై బీఆర్ఎస్ పోరుబాటకు సిద్ధమైంది. కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతను నిరసిస్తూ నల్లగొండ వేదికగా సమరశంఖం పూరించనుంది. ఈ నెల 13న చలో నల్లగొండ పేరుతో భారీ బహిరంగసభకు సన్నద్ధమవుతున్నది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరుకానుండడంతో పార్టీ యావత్ రంగంలోకి దిగింది. సభా ప్రాధాన్యతను వివరిస్తూ పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాలు నిర్వహించింది. కృష్ణానది ప్రాజెక్టులపై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అధికారాలను కేంద్రం పరిధిలోని కేఆర్ఎంబీకి అప్పగిస్తూ కాంగ్రెస్ సర్కార్ చేసిన నిర్వాకంపై ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. ముఖ్యంగా కృష్ణా పరీవాహక ప్రాంత రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ప్రాజెక్టుల నిర్వహణ రాష్ట్ర పరిధిలో ఉండడం వల్ల తెలంగాణ వచ్చాక కృష్ణాజలాల్లో నీటి వాటాను నిక్కచ్చిగా అప్పటి కేసీఆర్ సర్కార్ వాడుకోగలిగింది. దీంతో గత పదేండ్లల్లో మొత్తం 18 పంటకాలలకు సాగునీరును సమృద్ధిగా ఇవ్వగలిగింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో ఇక ముందు ఆ పరిస్థితి ఉండదు. దాంతో సాగునీటికే కాకుండా తాగునీటి అవసరాలకు కూడా ఇబ్బందులు తప్పవని ఇంజినీరింగ్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్లనే కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతను బీఆర్ఎస్ వెలుగులోకి తెచ్చి ప్రజలను చైతన్యం చేసే దిశగా కార్యాచరణ చేపట్టింది. అందులోభాగంగా మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంగా చలో నల్లగొండ పేరుతో బహిరంగ సభకు సిద్ధమైంది.

ముమ్మరంగా సభా ఏర్పాట్లు

చలో నల్లగొండ బహిరంగ సభకు పట్టణ శివారులోని నార్కట్‌పల్లి-అద్దంకి హైవేకు నుకుని మర్రిగూడ బైపాస్‌లో విశాలమైన స్థలంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సభా నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సభా ప్రధాన వేదిక, కళాకారుల వేదిక నిర్మాణం పూర్తి కావస్తుండగా గ్యాలరీల నిర్మాణం, బారీ కేడింగ్, పార్కింగ్ స్థలాల పనులన్నీ చకచకా సాగిపోతున్నాయి. మరోవైపు సభకు విస్తృత ప్రచారం కల్పిస్తూ ప్రజలను కదిలించేందుకు బీఆర్ఎస్ పార్టీ యావత్తు రంగంలోకి దిగింది. కృష్ణానదీ పరీవాహక ప్రాంతాలపై నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలతో పాటు తాగునీటిపై ఆధారపడిన రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి కూడా ప్రజలు తరలిరావచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశాల నిర్వహణ పూర్తైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడ చూసినా చలో నల్లగొండ సభపై చర్చ సాగుతున్నది. రేపు సాయంత్రం 4గంటలకు సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏం చెబుతారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, ఫిబ్రవరి 11 : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కోటీ 30 లక్షల ఉపాధి హామీ నిధులను, లోతుకుంటలో రూ.5 లక్షలు, అర్రూరులో రూ.14లక్షలు, వెంకటాపురంలో రూ.20 లక్షలు, టేకులసోమారం గ్రామంలో 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేసి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అనంతరం వేంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో ఎఫ్ఎస్‌సీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్, జడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమాబాలనర్సింహ, ఎంపీటీసీలు, తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ సుగుణాకర్‌రావు, కొడూరి బాలరాజు పాల్గొన్నారు.

సెంట్రింగ్ బాక్సుల చోరీ

రామన్నపేట, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలో రెండు లక్షల రూపాయల విలువైన 180 సెట్రింగ్ బాక్సులు చోరీకి గురయ్యాయి. మండల కేంద్రానికి చెందిన బడ్డ ప్రసాద్ సెంట్రింగ్ మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనిలో భాగంగా ఈ నెల 9న భువనగిరి - చిట్యాల మెయిన్‌రోడ్డులోని ఎస్సీ హాస్టల్ పక్కన గల మిర్జా అన్వర్‌బేగ్ ప్లాట్‌లో 180 సెట్రింగ్ డబ్బాలను వేశాడు. ఆదివారం ఉదయం పని చేసేందుకు అక్కడికి వెళ్లి చూడగా సెంట్రింగ్ డబ్బాలు లేక పోవడంతో పక్కనే ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించాడు. చిట్యాల వైపు నుంచి వచ్చిన అశోక్ లేలాండ్ వాహనంలో డబ్బాలను లోడ్ చేసుకొని వెళ్లినట్లు రికార్డు అయ్యింది. బాధితుడు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'రాష్ట్ర బడ్జెట్‌లో విద్యార్థులకు అన్యాయం'

వలిగొండ, ఫిబ్రవరి 11 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి, విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశారని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులతో కలిసి ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగానికి గత ప్రభుత్వం కేటాయించిన నిధుల కన్నా తక్కువ కేటాయించారన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల మెస్ చార్జీలు ఇవ్వడం లేదని, బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసే లేదని విమర్శించారు. కార్యక్రమంలో గొలుసుల మధు, మల్లయ్య, క్రాంతి కుమార్, వెంకటేశ్వర్లు, విద్యారత్నం, సుధాకర్ పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

బీబీనగర్, ఫిబ్రవరి 11 : మండలంలోని చిన్నరావులపల్లి గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణానికి యువజన సంఘాలతోపాటు గ్రామస్తుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ నెల 19న శివాజీ జయంతి సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపన చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు గోరుకంటి బాలచందర్, మాజీ సర్పంచ్ బక్కన్న బాలమణి, నాయకులు, గ్రామస్తులు, శివాజీ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ నమోదు పరిశీలన

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 11 : మహాలక్ష్మి పథకం ద్వారా రూ.5 వందలకే గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించగా.. ప్రజాపాలన గ్రామ సభల్లో ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 548 మంది గ్యాస్ సిలిండర్ల కోసం దరఖాస్తులో సమాచారం తప్పుగా ఇచ్చారు. గ్యాస్ పుస్తకంలోని నెంబర్లను తప్పుగా వేయడంతో వారి నుంచి సేకరించిన డాటా ఎంట్రీ నమోదును ఆదివారం గ్రామపంచాయతీ కార్యాయలంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది బాలరాజు, హరిబాబు ఉన్నారు.

23నుంచి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

వార్షిక బ్రహోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 11 : పట్టణంలోని రాయగిరి గ్రామంలో ఈ నెల 23 నుంచి 27వరకు వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాయగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆలయ కోనేరు వద్ద ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, రాయగిరి మాజీ ఎంపీటీసీ హనుమంతునాయక్, మాజీ సర్పంచ్ కళ్లెం బాలనరసింహ, నాయకులు మేకల బాలనరసింహ, బొజ్జ ఎల్లేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

12నుంచి మార్కండేయస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు

మార్కండేశ్వర దేవాలయం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 11 : పట్టణంలోని మార్కండేయ స్వామి దేవాలయం 47వ వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఈ నెల 12 నుంచి 19 వరకు కార్యక్రమాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఈ నెల 12న మార్కండేయ మహర్షి జన్మదినం, లక్ష పుష్పార్చన, పవిత్రోత్సవం, 13న విఘ్నేశ్వర స్వామి పూజ, ధ్వజారోహణం, 14న శివ పంచాయతన యజ్ఞం, సీతారామచంద్రస్వామి కల్యాణం, 15న లక్ష బిల్వార్చన, 16న లక్ష గాయత్రీ మహా యజ్ఞం, భద్రావతి భావనారుషి కల్యాణం, 17న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, 18న సహస్ర ఘటాభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు, 19న స్వామివారి రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న వీఓఏలు స్వప్న, శ్యామల

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 11 : మహిళా సంఘాల సభ్యులందరూ బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదుగాలని వీఓఏలు తవిటి స్వప్న, పాశం శ్యామల అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాయలంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించి కొత్త రుణాలను పొందాలన్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సామాజిక జీవన విధానాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అనిత, ఆండాలు, లక్ష్మి, పావని పాల్గొన్నారు.

ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలి

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 11 : ఈ నెల 15న నిర్వహించే ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని సోమేశ్వర ఆటో యూనియన్ అధ్యక్షుడు మిట్టపల్లి పాండుగౌడ్ అన్నారు. మండలంలోని కొలనుపాకలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేపట్టడంతో తాము నష్టపోతున్నామన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 15న రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు బంద్ చేపడుతున్నట్లు తెలిపారు. డ్రైవర్లు మల్లేశ్, నర్సయ్య, లక్ష్మీనర్సయ్య, క్రాంతి, కర్ణాకర్, నాగయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సోమేశ్వర ఆటో యూనియన్ అధ్యక్షుడు పాండు

'బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి'

బొమ్మలరామారం, ఫిబ్రవరి 11 : కృష్ణానది జలాల్లో రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు ధీరావత్ బాల్‌సింగ్ కోరారు. మండలంలోని పిల్లిగుండ్ల తండాలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సభకు బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు స్వచ్ఛందంగా అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ సాయికుమార్, యూత్ అధ్యక్షుడు సంగి పరశురాం, ధీరావత్ సురేశ్, నరేశ్ పాల్గొన్నారు.

మజీద్ ఏనూర్ నూతన కమిటీ

మహ్మద్ ఇబ్రహీం

సమీరుద్దీన్

మోత్కూరు, ఫిబ్రవరి 11 : మున్సిపాలిటీ కేంద్రంలోని పోతాయిగడ్డలో ఏ నూర్ మజీద్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం నమాజ్ అనంతరం జరిగిన సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ ఇబ్రహీం, ఉపాధ్యక్షులుగా కాసీం, అమీర్, ప్రధాన కార్యదర్శిగా సమీరుద్దీన్, కోశాధికారిగా ఖలీల్, సహాయ కార్యదర్శిగా జానీ, ప్రచార కార్యదర్శిగా షాకీరుద్దీన్, ముఖ్య సలహాదారులుగా మహ్మద్ మునీరుద్దీన్, అబ్బాస్, మెహబూబ్, రశీద్, ఖాజాతోపాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రజలమంతా సోదరాభావం కలిగి ఉండాలన్నారు. మజీదు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రజక సంఘం నూతన కమిటీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

రజక సంఘం నూతన కమిటీకి సన్మానం

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని ఆదర్శ రజక సహకార సంఘం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎలిమినేటి మురళీకృష్ణ, పైళ్ల ప్రశాంత్, కార్యవర్గ సభ్యులను ఆదివారం సంఘం కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎలిమినేటి బుచ్చయ్య, సత్యనారాయణ, ఎలేందర్, సత్తయ్య, రామస్వామి, వెంకటేశ్, ఉప్పలయ్య, రాములు, శంకరయ్య, మత్స్యగిరి పాల్గొన్నారు.

రూ.1.50లక్షల ఎల్ఓసీ అందజేత

మోత్కూరు, ఫిబ్రవరి 11 : మండలంలోని దత్తప్పగూడేనికి చెందిన ఎలుగు అవిలయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.50లక్షల ఎల్ఓసీని కాంగ్రెస్ నాయకులు ఎలుగు యాదయ్య ఆదివారం అందించారు. అవిలయ్య గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో వైద్యం పొందుతున్నాడు. రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి నుంచి నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింత చంద్రయ్య, వెంకన్న, భాస్కర్, మల్లేశ్, సత్తయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం)లో ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలు

ఊపందుకున్న ఉపాధి హామీ

- మండలంలో 5,290 జాబ్ కార్డులు.. పనులకు వెళ్తున్న 90శాతం కూలీలు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 11 : పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో 5,290 మంది జాబ్‌కార్డులు కలిగి ఉండగా 90శాతం మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో ఉపాధి హామీని ఉపయోగించుకుంటున్నారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.150 నుంచి 170 రూపాయల వరకు వేతనం పడుతున్నట్లు కూలీలు తెలిపారు.

రోజూ కూలి పనికి పోతున్నాం

ఉపాధి హామీ పని పుట్టినప్పటి నుంచి 19ఏండ్లుగా కూలి పనికి పోతున్నా. మాలాంటి పేద కుటుంబానికి ఉపాధి పనితో ఎంతో మేలు జరుగుతుంది. కష్టం చేసినా ఫలితంగానే అనిపిస్తుంది. పనిచేసినన్ని రోజులు రోజుకు రూ.190 నుంచి రూ.270 వరకు వస్తున్నాయి. ఇలాంటి పథకం ఎప్పటికీ ఉండాలని కోరుకుంటున్నా. ప్రభుత్వం పని దినాలను పెంచి కూలి డబ్బులు కూడా పెంచాలి.

– రచ్చ పద్మ, ఉపాధి హామీ కూలీ, ఆత్మకూరు(ఎం)

జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నాం

ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పిస్తున్నాం. గ్రామాల్లో రైతుల భూములు చదును చేయడం, వరద కట్టలు పోయడం, ముండ్ల పొదలు తొలగించడం, నీటి కుంటలు నిర్మించడం వంటి పనులతో పాటు వరద కట్టలు, కుంటలు, చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతున్నాం. నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు చేయిస్తున్నాం. కూలీలు సంవత్సరానికి 50రోజులకు తగ్గకుండా పనులకు రాకుంటే జాబ్‌కార్డు రద్దు చేస్తాం. కొత్త జాబ్‌కార్డు కోసం ఆధార్, కేవైసీ నమోదుతోపాటు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌ను అందజేయాలి.

– బొడిగే రమేశ్‌గౌడ్, ఏపీఓ